క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లిలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కలిగిరిలో ఓ మోస్తరు వర్షం

కలిగిరి: మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారడంతో ప్రజలు ఊరట చెందారు. కాగా ఇటీవల కురిసిన వర్షానికి పొలాలు పదునెక్కి దుక్కులకు అనుకులంగా మారాయి. దీంతో దుక్కులు చేసేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు.

బీమా నగదు అందజేత



అల్లూరు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అల్లూరు శాఖకు చెందిన ఖాతాదారుడు బొట్ట విజయకుమార్ ఇటీవల మరణించగా ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా పథకం ద్వారా రూ.2 లక్షలు నగదు మంజూరైంది. ఈ మొత్తాన్ని మృతుడి భార్య బొట్ట మస్తానమ్మకు బ్యాంక్ మేనేజరు కృష్ణకుమార్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం



సంగం: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న గంగమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఆలయాల ప్రాంగణంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి తలుపుల తాళాలు పగులగొట్టేందుకు యత్నించి వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఆలయాల వద్దకు వచ్చిన అర్చకుడు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఆలయం వద్దకు వచ్చి పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

20న ఉచిత ఖత్నాలు

ఉదయగిరి: పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 20న రహతులీల్ అలామీన్ ట్రస్ట్, చిన్నమసీదు ఆధ్వర్యంలో ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల చిన్నారుల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల పేర్లను ముందుగా 94904 27421, 70138 58306 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు వెలగపాడులో ఆరోగ్య సురక్ష శిబిరం

కలిగిరి: మండలంలోని వెలగపాడులో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి గీతారెడ్డి గురువారం తెలిపారు. గ్రామసచివాలయం ఆవరణంలో నిర్వహించే శిబిరంలో నిపుణులైన వైద్యులు రోగులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేయించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వెలగపాడు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేటి నుంచి సీతారాముల ఉత్సవాలు

వరికుంటపాడు: మండలంలోని సాతువారిపల్లిలోని సీతారామ మందిరం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, మూల మూర్తులకు విశేషాభిషేకాలు, పూజలు, గ్రామోత్సవం, శనివారం ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, సీతారాముల కల్యాణ మహోత్సవం, సాయంత్రం కుంకుమార్చన, గ్రామోత్సవం, ఆదివారం వసంతోత్సవం, పారువేట, లంకాదహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

పెంచల గొడుగుల ఊరేగింపు

ఆత్మకూరు: పెంచలకోన బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మొక్కుబడులు కలిగిన భక్తులు ఆత్మకూరులో గురువారం పెంచల గొడుగులను ఊరేగించారు. గోవిందా..గోవిందా..పెంచలా.. అంటూ ఇంటింటికి వచ్చి కానుకలను స్వీకరించారు. అనంతరం పెంచలకోనకు కాలినడకన వెళ్లి శ్రీవారి కల్యాణం రోజున గొడుగులు, కానుకలను సమర్పించనున్నట్లు వారు తెలిపారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



సీతారామపురంలో..



వరికుంటపాడులో..



సంగంలో..



మర్రిపాడులో..

కలిగిరి: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతారెడ్డి సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిగిరిలో వైద్యారోగ్య సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ నెల ప్రారంభం నుంచి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. వర్షాలకు దోమలు వ్యాపించి డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, బోధకాలు, తదితర కీటక జనిత వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను విధిగా పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.



కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఉదయగిరి: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి మెయిన్‌బజార్ వరకు వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలతో వ్యాపించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సీహెచ్‌ఓ శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరికుంటపాడులో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా మాట్లాడుతూ దోమలతో సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతారామపురంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి ఏ స్వప్నారెడ్డి మాట్లాడుతూ డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్‌ఎస్ రియాజ్, పీహెచ్‌ఎన్ కృష్ణమ్మ, హెల్త్‌అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రిపాడు: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మర్రిపాడులో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు గోపీనాథ్, శాంతి మాట్లాడుతూ పగటిపూట కుట్టే దోమలతో డెంగీ వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నిర్మూలించవచ్చని, తద్వారా దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టవచ్చని వివరించారు.

సంగం: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగంలో పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులరెడ్డి, అశోక్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ కాటుతో డెంగీ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. అకస్మాత్తుగా కండరాల నొప్పులు, తీవ్రజ్వరం డెంగీ లక్షణాలని వివరించారు.

పైన ధీమా..లోన గుబులు



- పార్టీ నాయకులతో టీడీపీ అంతర్గత భేటీ
- డబ్బు ప్రభావం, ఓట్ల శాతంపై విశ్లేషణ
- బలమైన సామాజిక వర్గం ఓట్లపైనే ప్రధాన చర్చ

సీతారామపురం: ఉదయగిరి నియోజకవర్గ స్థానం గెలుపు ఎవరి సొంతం అవుతుందనే దానిపై విశ్లేషణలు జోరందుకున్నాయి. ఫలితం తేలడానికి ఇంకా 18 రోజుల వ్యవధి ఉండడంతో అటు అభ్యర్థులు, ఇటు ప్రజల్లో గెలుపోటములపై ఉత్కంఠ నెలకొంది. ఉదయగిరి బరిలో ఎవరు గెలుస్తారంటూ బంధువులు, స్నేహితులు, సహోద్యోగులకు పొరుగు నియోజకవర్గాల వారు కూడా ఫోన్లు చేసి ఆరాతీస్తున్నారు. ఈ సారి ఎన్నికల్లో యువకులు, మహిళలు, వలస ఓటర్లు అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. వారు ఎటువైపు తీర్పు ఇచ్చారన్న దానిపైనే ప్రధానంగా చర్చ నడుస్తోంది. ఓటుకు నోటు ప్రభావం ఎంత వరకు ఉంటుందనేదానిపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. గత ఎన్నికల్లో ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థే గెలుస్తాడనే చర్చ ఎక్కువగా సాగుతోంది. టీడీపీ నేతలుపైకి ధీమా వ్యక్తం చేస్తున్నా, లోలోన డీలాపడి గుబులు చెందుతున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో గెలుపోటములపై ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. ఉదయగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లో గెలుపుపై వైఎస్సార్‌సీపీ ధీమాగా ఉంది. టీడీపీ నేతలు పైకి విజయం తమదేనని చెబుతున్నా లోలోన మదనపడుతున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి పోలింగ్ రోజు వరకు ఆ పార్టీ అభ్యర్థి ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. ట్రస్ట్ సభ్యులతో సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో బృందాలను నియమించుకుని వారితో మంత్రాంగం నడిపారు. అలాగే పలు మండలాలలో బొల్లినేని వర్గీయులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. టీడీపీ అభ్యర్థి ఎన్‌ఆర్‌ఐ కావడంతో పార్టీతో ఆయనకు అనుబంధం తక్కువే. సొంత మనుషులు, ట్రస్ట్ సభ్యులతో ఓటర్లను ప్రలోభాల్లో ముంచి రాజకీయం చేయాలని ఊహించారు. ఇది ఎవరికీ రుచించలేదని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. ఏది ఏమైనా ఈ గుబులు తగ్గాలంటే ఫలితాలు వెలువడే వరకు ఆగక తప్పదు.

వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా అనంతసాగరం

సోమశిల: ఆత్మకూరు అసెంబ్లీ స్థానం గెలుపోటములతో పాటు మెజార్టీపైన అనంతసాగరం మండలం కీలక ప్రభావం చూపుతోంది. ఈ మండలం వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉంది. మండలంలో 45 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఈ దఫా ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక చొరవతో అత్యధిక శాతం పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు సైతం వైఎస్సార్‌సీపీపై ఉన్న అభిమానంతో ఓటింగ్‌కు రావడం విశేషం. గతంలో జరిగిన ఎన్నికల్లో సైతం వైఎస్సార్‌సీపీకి మిగిలిన మండలాల కంటే అనంతసాగరం మండలంలో ఎక్కువ మెజార్టీ లభించింది. 2014లో వైఎస్సార్‌సీపీకి 8,008 ఓట్ల మెజార్టీ రాగా, 2019లో 6,632 మెజార్టీ వచ్చింది. 2024 జరిగిన ఎన్నికల్లో మండలంలో 35,702 ఓట్లు ఉండగా, 29,758 ఓట్లు పోల్ అయ్యాయి. పోలింగ్ 83.35 శాతంగా నమోదైంది. ఈ ఎన్నికల్లో మండలం నుంచి తప్పకుండా ఆరు వేల నుంచి ఏడు వేలకు పైగా మెజార్టీ వైఎస్సార్‌సీపీకి లభించే అవకాశం ఉందని రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నారు. మండలంలో ఫ్యాన్ గాలి బలంగా వీస్తోందని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి మళ్లీ తప్పక విజయం సాధిస్తారని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకటేష్ మృతదేహం

సంగం: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. వివరాలు... మర్రిపాడు మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన వెంకటేష్(35) మోటార్‌సైకిల్‌పై నెల్లూరు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఉడ్‌హౌస్‌పేట వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుకగా ఢీకొన్నాడు. వెంకటేష్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి హైవే అంబులెన్స్‌లో నెల్లూరు వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గం మధ్యలో బుచ్చిరెడ్డిపాళెం వద్ద మృతి చెందాడు. దీంతో వెంకటేష్ మృతదేహాన్ని బుచ్చిరెడ్డిపాళెం మార్చురీకి తరలించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

ఆటోను కారు ఢీకొనడంతో మహిళకు తీవ్రగాయాలు

ఆటోను కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన గురువారం రాత్రి దువ్వూరు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..సంగం గ్రామానికి చెందిన విజయలక్ష్మికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఉదయం నెల్లూరులోని వైద్యశాలకు వెళ్లింది. అక్కడ చూపించుకుని తిరిగి ఆటోలో సంగం వస్తుండగా దువ్వూరు వద్ద సంగం నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

ఆత్మకూరు: ఈ నెల 13న పోలింగ్ రోజు తమను ఓ యువకుడు దూషించడమే కాకుండా దాడికి పాల్పడ్డాడని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్, న్యాయవాది టీ తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..ఆదిఆంధ్ర పాఠశాలలోని కేంద్రంలో తిరుపతమ్మ, ఆమె భర్త వెంకటేశ్వర్లు పోలింగ్ ఏజెంట్లుగా విధులు నిర్వహించారు. ఆ సమయంలో కేశవులు అనే యువకుడు నానా దుర్భాషలాడుతూ ఇనుపరాడ్డుతో తమపై దాడికి పాల్పడ్డాడని, ఆ సమయంలో సమీపంలో ఉన్న వారు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పిందని.. మధ్యాహ్నం మరోసారి దాడికి పాల్పడ్డాడని.. ఇలా రెండుసార్లు తమపై హత్యాయత్నానికి ప్రయత్నించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగి మృతికి సంతాపం

ఆత్మకూరు: పట్టణంలోని దోర్నాదులవారివీధిలో నివశిస్తున్న పశుసంవర్ధక శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి గాలి మోహన్ (38) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. చేజర్ల మండలంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన రోజూలాగే విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. అనంతరం గుండెనొప్పిగా ఉందని ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ ఇచ్చిన మందులు తీసుకుని ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా మోహన్ మృతిపై ఏడీ జయచంద్ర, పలువురు సిబ్బంది సంతాపం తెలిపారు.

ముమ్మరంగా బీసీజీ వ్యాక్సినేషన్



కలిగిరిలో వ్యాక్సిన్లు వేస్తున్న వైద్యసిబ్బంది



వరికుంటపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ



ఉదయగిరి: వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారిణి శివకల్పన

కలిగిరి: జాతీయ క్షయ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్థానిక సచివాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి మాట్లాడుతూ ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ డేగా నిర్ణయించినట్లు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన షుగర్ వ్యాధిగ్రస్తులు, క్షయ వ్యాధి వచ్చి చికిత్స పొందిన వారికి బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు చెంచుకృష్ణారెడ్డి, అశోక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని 12 సచివాలయాల్లో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని సచివాలయం–3లో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారిణి ఎం శివకల్పన పరిశీలించారు.

వరికుంటపాడు: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ముందుగా ఎంపిక చేసిన పెద్దలకు వైద్యారోగ్య సిబ్బందికి వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఆయేషా,కరీష్మా మాట్లాడుతూ మండలంలో సుమారు 25వేల మంది పెద్దలకు బీసీజీ వ్యాక్సిన్ వేయాలని లక్ష్యం కాగా, ప్రతి గురువారం సచివాలయాల పరిధిలోని ఏదోక గ్రామంలో వ్యాక్సినేషన్లు వేస్తున్నట్లు తెలిపారు. బీసీజీ వ్యాక్సిన్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి గురువారం రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల మృతి చెందిన 3వ వార్డుకు చెందిన కొప్పవరపు వెంకటశేషయ్య, 7వ వార్డుకు చెందిన షేక్ ఖాదర్‌బాషా, 9వ వార్డుకు చెందిన దేవరపల్లి లక్ష్మమ్మ, 11వ వార్డుకు చెందిన తంగిళ్లపల్లి పెద్దలక్ష్మమ్మ, 12వ వార్డుకు చెందిన కటారి నాగరాజు, 12వ వార్డుకు చెందిన మాముడూరి గోపీకృష్ణ కుటుంబాలకు ట్రస్టు కార్యాలయంలో నగదు చెక్కులను అందజేశారు. విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తొలకరి పలకరింపుతో అన్నదాతల హర్షం



గండిపాళెం జలాశయంలో చేరిన వర్షపునీరు



వర్షాలకు తడిచిన పంటపొలాలు

వరికుంటపాడు: ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మేలోనే తొలకరి జల్లులు పలకరిస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్దిరోజుల పాటు భానుడి ప్రతాపంతో ఎండవేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ తరుణంలో తొలకరి వర్షాలు పలకరించి వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. మరోవైపు వర్షాలకు భూమి పదునవడంతో పాటు సాగునీటి వనరుల్లో కొద్దిగా నీరుచేరింది. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని గండిపాళెం, నక్కలగండి రిజర్వాయర్లలో నీరు నిల్వ చేరి భూగర్భ జలాలు పెరిగాయి. మరోవైపు జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని, ఈ ఏడాది వర్షాలు విస్తారంగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది ముందస్తుగానే ఆరుతడి, ఎడగారు పంటల సాగుచేపట్టవచ్చని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు బీడు భూములు, అటవీ ప్రాంతంలోని చెట్లు చిగురించడంతో మూగజీవాలకు మేతకు ఇబ్బంది లేకుండా ఉండదని పశుపోషకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ ప్రక్రియను అపహాస్యం చేసేలా..

- పచ్చ పార్టీ డ్రామాలు
- వైఎస్సార్‌సీపీకి ఓటర్లు వెన్నుదన్నుగా నిలవడంపై అక్కసు
- టీడీపీకి ఓటేశారంటూ ఉద్దేశ పూర్వకంగా ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం
- పోలింగ్ సిబ్బంది చూశారంటూ నేరచరిత్ర కలిగిన వ్యక్తితో సమాచారం వ్యాప్తి

కావలి: కావలి నియోజకవర్గ ఓటర్లు వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా నిలవడాన్ని జీర్ణించుకోలేక టీడీపీ కొత్తడ్రామాలకు తీరతీసింది. ఎమ్మెల్యే రామిరెడ్డిపై తీవ్ర అక్కసును వెళ్లగక్కుతూ ఆయన టీడీపీకి ఓటేశారంటూ ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం సాగిస్తోంది. ఈ విషయాన్ని పోలింగ్ సిబ్బంది చూశారంటూ నేరచరిత్ర కలిగిన వ్యక్తి ద్వారా ప్రచారాన్ని వ్యాప్తి చేస్తూ మొత్తం పోలింగ్ ప్రక్రియనే అపహాస్యం చేసేలా వ్యవహరిస్తోంది. పోలింగ్ ముగిసిన తరువాత ఓటమి తప్పదని నిర్ధారించుకున్న టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, అతని అనుచరులు కొత్త డ్రామాలతో నియోజకవర్గంలో చిచ్చు పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పోలింగ్ సందర్భంగా ముసునూరు, అల్లూరు, దగదర్తిలో పలుచోట్ల కవ్వింపు చర్యలకు పాల్పడినా ఫలితం లేకపోవడంతో ఏకంగా పోలింగ్ పక్రియనే అపహాస్యం చేసేలా సరికొత్త డ్రామాకు తెరతీశారు. ఓ మీడియా చానల్‌ను అడ్డుపెట్టుకుని అసత్య ప్రేలాపనలతో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కావ్య అనుచరులు ఇప్పటికే ఓటర్ల ఇళ్లకు వెళ్లి తమ డబ్బులు వెనక్కి ఇవ్వాలంటూ గొడవలు చేస్తున్న విషయం తెలిసిందే. అదే విధంగా కావ్య అనుచరుడైన ముసునూరుకు చెందిన గొట్టిపాటి వంశీకృష్ణ ఏకంగా పోలింగ్ పక్రియను అపహాస్యం చేసేలా, ఓటరు గోప్యతా హక్కుకు భంగం కలిగించేలా కట్టుకథను సృష్టించాడు. కావలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటేశారంటూ ఓ మీడియాలో అసత్య ప్రచారం చేయించి అల్లర్లు సృష్టించేందుకు యత్నించాడు. ఓటరు గోప్యతకు భంగం కలిగించేలా ఎమ్మెల్యే ఎవరికి ఓటేశారో పోలింగ్ సిబ్బంది అంతా చూశారంటూ సంచలన వాఖ్యలు చేశాడు.

వంశీకృష్ణపై ఇప్పటికే పలు కేసులు

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డిపై అసత్య ప్రచారం చేసిన గొట్టిపాటి వంశీకృష్ణకు వివాదాస్పద వ్యక్తిగా పేరుంది. 2014, 2019 ఎన్నికల్లో గొడవలకు దిగడంతో అతనిపై పోలీసు కేసులు సైతం నమోదై ఉన్నాయి. వరుసగా ఎన్నికల్లో వివాదాలు సృష్టిస్తున్న వంశీకృష్ణను పోలీసులు ముందుగా బైండోవర్ చేసుకోవాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో 2024 ఎన్నికల్లో కూడా గొడవలకు దిగాడు. ముసునూరులో పోలింగ్ జరుగుతున్న సమయంలో 122వ పోలింగ్ కేంద్రం వద్ద వంశీకృష్ణ మరో ఏడు మందితో కలిసి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడికి పాల్పడ్డాడు. రక్తగాయాలు అయ్యేలా విచక్షణా రహితంగా దాడి చేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో వంశీకృష్ణతో పాటు మరో ఏడుగురు నిందితులపై కావలి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. దాడి సందర్భంగా వంశీకృష్ణ ఓటర్లను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

అలసత్వం వహించిన అధికారులు

గొట్టిపాటి వంశీకృష్ణపై గతంలో పలు కేసులు ఉన్నాయి. అటువంటి వ్యక్తిని ముందుగానే బైండోవర్ చేసుకోవాల్సిన పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. అతన్ని టీడీపీ నాయకులు బూత్ ఏజెంట్‌గా నియమించినా ఎన్నికల అధికారులు గుర్తించలేకపోయారు. నేరచరిత్ర కలిగిన సదరు వ్యక్తి పోలింగ్ ముగిసిన తరువాత కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి టీడీపీకి ఓటేశారని, పోలింగ్ అధికారులంతా చూశారంటూ ఓ మీడియా చానల్ వేదిక వాఖ్యలు చేసినా అధికారులు మౌనంగా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారం

కావలి టీడీపీ అభ్యర్థి కావ్యకు డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి కనబడకపోవడంతో దాన్ని జీర్ణించుకోలేక కావ్య శిబిరం పచ్చమీడియాను అడ్డుపెట్టుకుని ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అసత్య కథనాలు ప్రసారం చేస్తోంది. ఎమ్మెల్యే రామిరెడ్డి టీడీపీకి ఓటేశారని ప్రచారం చేస్తున్న వంశీకృష్ణకు 122వ నంబరు పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది. అక్కడే పోలింగ్ ఏజెంట్‌గానూ నిలబడ్డాడు. ఎమ్మెల్యే రామిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి 131వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎలాగైనా ఎమ్మెల్యేపై బురదజల్లాలనే ఉద్దేశంతో కావ్య డైరెక్షన్‌లో వంశీకృష్ణ ఓ మీడియా ద్వారా అసత్య ప్రచారాన్ని ప్రారంభించారు. కాగా ఈ ఘటన ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లడంతో కేసు నమోదుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.